క్లుప్తంగా

6న మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం అక్టోబరు 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. వివిధ శాఖల అధికారులు అక్టోబరు 3వ తేదీ లోపుగా తమ శాఖ ప్రగతి నివేదికలను సమర్పించాలని సూచించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పెదపులిపాకలో అమ్మవారికి కుంకుమార్చన



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న విజయరాజరాజేశ్వరి, విజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద పూర్ణిమ సందర్భంగా వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో విజయరాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందచేశారు.

కుక్కల దాడిలో నాటుకోళ్లు మృతి

పెనమలూరు: తాడిగడపలో కుక్కలు దాడి చేయటంతో 30 నాటుకోళ్లు మృత్యువు వాతపడ్డాయి. శ్రీనివాసనానగర్ కాలువ కట్ట పై అరేపల్లి గంగాధరం నాటుకోళ్లు పెంచుతున్నారు. గురువారం రాత్రి అందరూ నిద్రించిన తరువాత కుక్కలు కోళ్ల గూడుపై దాడి చేసి చంపేసాయి. ఈ దాడిలో 30 నాటుకోళ్లు చనిపోయాయి. తాడిగడప శ్రీనివాసానగర్‌కాలువ కట్ట పై కుక్కలు విపరీతంగా పెరిగాయని, మున్సిపాలటీ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు. చిన్నారులు, వృద్ధుల పై వీధి కుక్కలు దాడి చేయక ముందే అధికారులు వెంటనే స్పందించి కుక్కలను నివారించాలని కోరుతున్నారు.

రౌడీషీటర్‌పై బైండోవర్ కేసు

పెనమలూరు: రౌడీషీటర్ పై శుక్రవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు సనత్‌నగర్‌కు చెందిన కొండూరు మణికంఠ (కేటీఎం పండు)పై పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటు ఉంది. అతను కానూరు రామాలయం ప్రాంతంలో అనుమానాస్పందంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అమెరికాకు చెందిన డాక్టర్ రత్నం చిట్టూరి స్థాపించిన నార్త సౌత్ ఫౌండేషన్ ద్వారా భారతదేశంలో వృత్తి విద్య ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు సంస్థ ఉపకార వేతనాలు అందిస్తుంది. ఇందులో భాగంగా డిప్లమో, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు రూ. 1.25 లక్షల ఉపకార వేతనాలు సంస్థ ప్రతినిధి లయన్ సూరపనేని వెంకటరత్నం అందచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, గణితశాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ బీవీఎస్ఎన్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

పోటీలకు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టులో చోటు దక్కించుకున్నట్లు చెప్పారు. అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలుర జిల్లా జట్టుకు కొడాలి దీవెనరాజు, బాలికల జట్టుకు గెద్దల బ్యూలా ఎంపిక అయ్యారని తెలిపారు. బేస్‌బాల్ జిల్లా బాలుర జట్టుకు కొండా హరివెంకట దుర్గాప్రసాద్, పల్లపు సన్ని, కొడవలి ఆకాష్ ఎంపిక కాగా, బాలికల జట్టుకు కావ్యశ్రీ, కొల్లూరు సంజన ఎంపికయ్యారని వివరించారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ బాలుర జట్టుకు పులవర్తి మహేష్, బాలికల జిల్లా జట్టుకు గొర్రెల కళ్యాణి, సిరిగుడి హారిక, షేక్ యాస్మిన్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. బేస్‌బాల్ జిల్లా బాలుర జట్టుకు నక్కా కిరణ్‌కుమార్, నల్లపోతుల అక్షయ్, బాలికల జట్టుకు బందారు ఇందు ఎంపికై నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావును హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రబాబు అరెస్టు వెనుక మోడీ హస్తం

ఉయ్యూరు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టు వెనుక ప్రధాని మోడీ హస్తం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని నేషనల్ కాన్ఫరెన్స్ హాల్లో ఆ పార్టీ ఉయ్యూరు ఏరియా కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుకు అవసరమైతే సంఘీభావం తెలిపే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. టీడీపీతో కలిసి వెళ్లే ఆలోచన చేస్తామన్నారు. పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



పెనమలూరులో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పెనమలూరు: మండలంతో పాటు తాడిగడప మునిసిపాలిటీలో నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రారంభించనున్నారు. తాడిగడప మున్సిపాలిటీలో 19 వార్డు సచివాలయాలు, పెనమలూరు మండలంలో 11 గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇప్పటికే గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులు పరీక్షించారు. శనివారం ఉదయం మండల పరిధిలో చోడవరం గ్రామంలో వైద్య శిబిరం ప్రారంభిస్తారు. దీనికి గాను సర్వేలో గుర్తించిన 720 మందికి టోకెన్లు ఇచ్చారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు 1లో కూడా 860 మందికి టోకెన్లు అందచేశారు.

మండల పరిధిలో వైద్య శిబిరాలు...

పెనమలూరు మండల పరిధిలో వైద్య శిబిరాల తేదీల ఎంపీడీఓ సునీతాశర్మ ప్రకటించారు. 30వ తేదీ చోడవరం, అక్టోబర్ 3వ తేదీ గంగూరు 1 సచివాలయం, 5వ తేదీ వణుకూరు 1 సచివాలయం, 6వ తేదీ పెనమలూరు 2 కమ్యూనిటీహాల్, 7వ తేదీ గోసాల 1 సచివాలయం, 10వ తేదీ పెనమలూరు 3 కమ్యూనిటీహాల్, 11వ తేదీ గంగూరు 2 సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. 12వ తేదీ పెదపులిపాక సచివాలయం, 16వ తేదీ వణుకూరు 2 సచివాలయం, 17వ తేదీ గోసాల 2 సచివాలయంలో శిబిరాలు ఉంటాయి.

తాడిగడపలో...

తాడిగడప మున్సిపాలటీలో 30వ తేదీ ఉదయం 9 గంటలకు కానూరు 1లో వైద్య శిబిరం ప్రారంభిస్తారు. మున్సిపాలటీలో ఆయా సచివాలయాల వివరాలు ఇలా ఉన్నాయి.అక్టోబర్ 3వ తేదీ పోరంకి 1, 4వ తేదీ కానూరు 2, 5వ తేదీ పోరంకి 2, 6వ తేదీ కానూరు 3, 9వ తేదీ కానూరు 4, 12వ తేదీ కానూరు 5, 13వ తేదీ పోరంకి 3, 18వ తేదీ తాడిగడప 1లో వైద్య శిబిరాలు ఉంటాయి. 19వ తేదీ పోరంకి 4, 20వ తేదీ తాడిగడప 2 వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. 21వ తేదీ పోరంకి 5, 25వ తేదీ తాడిగడప 3, 26వ తేదీ యనమలకుదురు 1, 27వ తేదీ తాడిగడప 4, 28వ తేదీ యనమలకుదురు 2, 31వ తేదీ యనమలకుదురు 3 సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. నవంబర్ 2వ తేదీన యనమలకుదురు 4, 4వ తేదీన యనమలకుదురు 5లో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ ప్రకాశరావు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక క్యాంపులు..

కంకిపాడు: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఈ నెల 30వ తేదీ నుంచి ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30న కంకిపాడు-2 సచివాలయం, అక్టోబరు 3న కుందేరు, 4న ప్రొద్దుటూరు, 5న పునాదిపాడు-1, 6న మంతెన, 7న కోలవెన్ను, 9న వేల్పూరు, 10న ఈడుపుగల్లు-2, 11న ఈడుపుగల్లు-1, 12న నెప్పల్లి, 16న మద్దూరు, 17న తెన్నేరు, 18న దావులూరు, 19న కంకిపాడు-1, 20న కంకిపాడు-3, 21న గొడవర్రు, 24న పునాదిపాడు-2 సచివాలయం పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్విహిస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

> **జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో...**
>
> ఉయ్యూరు: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ఉయ్యూరు పట్టణంలోని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తారన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సురక్ష సేవలు పొందాలని కోరారు.

గన్నవరం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ తెలిపారు. తొలిరోజు శనివారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 3న అల్లాపురం ఎంపీపీ పాఠశాలలో, 4న కొత్తగూడెం ఎంపీపీ స్కూల్‌లో, 5న గన్నవరంలోని మత్స్య సహకార సంఘ భవనంలో, 6న గన్నవరం జెడ్పీ బాలురోన్నత పాఠశాల ఆవరణలో, 7న చిన్నఅవుటపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో, 9న చనుపల్లివారిగూడెం పాఠశాలలో, 10న గొల్లనపల్లి గ్రామసచివాలయంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 11న ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో, 12న వీరపనేనిగూడెం హైస్కూల్‌లో, 13న సవారిగూడెం స్కూల్‌లో, 16న సూరంపల్లి హైస్కూల్‌లో, 17న అజ్జంపూడి గ్రామ సచివాలయంలో, 18న పురుషోత్తపట్నం విలేజ్ క్లినిక్‌లో, 19న కొండపావులూరు స్కూల్‌లో, 20న చిక్కవరం సచివాలయంలో శిబిరాలు జరుగుతాయని చెప్పారు. అక్టోబర్ 21న తెంపల్లి స్కూల్‌లో, 25న సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో, 26న బుద్ధవరం స్కూల్‌లో, 27న దావాజిగూడెం హైస్కూల్‌లో, 28న కొత్తగూడెం స్కూల్‌లో, 30న కేసరపల్లి హైస్కూల్‌లో, 31న వీఎన్.పురం కాలనీ స్కూల్‌లో శిబిరాలు జరుగుతాయని, ఆయా గ్రామసచివాలయాల పరిధిలోని ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన ఆరోగ్యం....

విజయవాడరూరల్: ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం నుంచి విజయవాడ రూరల్ మండలంలో జరుగుతాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అధికారులు, వైద్యాధికారులు రెండు జట్లుగా ఏర్పడి గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 30న గొల్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, అక్టోబర్ 3న గూడవల్లి ఎంపీయూపీ స్కూల్‌లో, 4న గొల్లపూడి సచివాలయం 2లో, 5న గూడవల్లి ఆయుర్వేద ఆసుపత్రిలో, 6న గొల్లపూడి సచివాలయం3లో, 7న నిడమానూరు సచివాలయం 2లో, 9న గొల్లపూడి సచివాలయం 4లో, 10న నిడమానూరు సచివాలయం 1లో శిబిరాలు జరుగుతాయి. అక్టోబర్ 11న గొల్లపూడి వైఎస్సార్ కాలనీలో, 12న రామానగర్ నిడమానూరు 3లో, 13న పైడూరుపాడులో, 16న ఎనికేపాడు సచివాలయం 1లో, 17న రాయనపాడులో, 18న ఎనికేపాడు 2 లైబ్రరీ వద్ద, 19న జక్కంపూడి 1 సచివాలయం వద్ద, 20న ప్రసాదంపాడు సచివాలయం 3లో శిబిరాలు జరుగుతాయి. అక్టోబర్ 21న జక్కంపూడి కాలనీ జెడ్పీ హైస్కూల్లో, 24న ప్రసాదంపాడు 3 సచివాలయం వద్ద, 25న జక్కంపూడి కాలనీ 2 సచివాలయం, 26న ప్రసాదంపాడు సచివాలయం 3, 27న కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, 28న రామవరప్పాడు ఎంపీపీ స్కూల్ మెయిన్, 30న నున్న సీఎస్ఐ కమ్యూనిటీహాలు, 31న జెడ్పీ హైస్కూల్ రామవరప్పాడులో శిబిరాలు నిర్వహిస్తారు. నవంబర్ 1వ తేదీన నున్న సచివాలయం 2లో, 2న రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలో, 3న నున్న సచివాలయం1లో, 4న రామవరప్పాడు సచివాలయం 3లో, 6న పాతపాడులో, 7న రామవరప్పాడు సచివాలయం 5లో, 8న పి.నైనవరంలో, 9న అంబాపురంలో వైద్యశిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఈ వైద్యశిబిరాలకు వైద్యనిపుణులు వస్తారని, ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను వారికి తెలియజేసి చికిత్స పొందాలని ఎంపీడీఓ కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నిడమానూరు జెడ్పీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయుల బృందం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఇటీవల నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా 17, 14 సంవత్సరాల బాల, బాలికల ఫుట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం పి.రమాదేవి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అండర్-14 బాలుర విభాగంలో అఖిల్, కార్తీక్ శర్మ, గౌతమ్, రత్నచంద్, అండర్ -14 బాలికల విభాగంలో ఎస్‌కే సమీనా, అంకిత, అండర్ -17 బాలికల విభాగంలో రమ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. వీరు త్వరలో కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, రాజేంద్రకుమార్, బలరాం, గౌసియా, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. నిడమానూరు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం మేరీ మట్టీ...మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మట్టి కలశం, జాతీయ జెండాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, నా మట్టి- నా దేశం భావన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

> ### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం
>
> పెనమలూరు: యనమలకుదురులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. యనమలకుదురు సెక్షన్ పరిధిలో తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో విద్యుత్ సరఫరా పై సమయాల్లో ఉండదన్నారు.
>
> ### మంతెనలో విద్యార్థుల ర్యాలీ
>
> 
>
> కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మేరీ మిట్టి-మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. దేశం గొప్పతనం, దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల స్ఫూర్తిని కొనియాడుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధి తిరుమల కోటేశ్వరరావు కుమారుడు తిరుమల వేణు రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగూరు సర్పంచ్ వైద్య చికిత్సకు రూ.6.70 లక్షలు సాయం



సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: తీవ్ర అనారోగ్యంతో ఉన్న గంగూరు గ్రామ సర్పంచ్ తస్లీముస్నీసా వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.6.70 లక్షలో ఎల్‌ఓసీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ పత్రాన్ని సర్పంచి తస్లీముస్నీసా భర్త అక్బర్‌పాషాకు శుక్రవారం అందచేశారు. గంగూరు సర్పంచ్‌కి గతంలో బ్రేన్‌స్ట్రోక్ వచ్చింది. వైద్య చికిత్స తరువాత ఆమె కోలుకుంది. అయితే ఆమె ఆరోగ్యం మరల క్షీణించటంతో అత్యవసర వైద్యం అవసరం ఏర్పడింది. సర్పంచ్‌ని ఎనికేపాడు అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోలు చేర్చారు. ఖర్చుతో కూడిన వైద్య కావటంతో ఎమ్మెల్యే పార్థసారథి సీఎం కార్యాలయంతో మాట్లాడి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేయించారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



హారికకు ఆర్థిక సాయం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆర్థిక సాయం అందించటం హర్షణీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. వ్యవసాయ కూలీ అయిన జంగం సీమోనుకు తన కూతురు హారిక చదువు ఖర్చు భరించటం ఇబ్బందిగా మారడంతో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను ఆశ్రయించారు. ఎమ్మెల్యే వంశీ ఆదేశాల మేరకు స్థానిక విజయవాడ రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం హారికకు ఎమ్మెల్యే పంపిన రూ.35వేలు ఆర్థికసాయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రంగన్నగూడెం గ్రామ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గన్నవరం: నియోజకవర్గంలోని గన్నవరం, బాపులపాడు మండలాల్లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పాల్గొంటారని శాసనసభ్యుని కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాపులపాడులోని తారకరామనగర్‌లో రజక కమ్యూనిటీ హాలు, ఇందిరానగర్‌లో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే గన్నవరం రజక రామాలయం వద్ద కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన, తెంపల్లిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నిడమానూరు జెడ్పీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ శీలం రంగారావు తదితరులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారధి ఫౌండేషన్ నిర్వహించిన వక్తత్వ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారని పాఠశాల హెచ్‌ఎం రమాదేవి తెలిపారు. పాఠశాల విద్యార్థులు జాయ్ క్రిస్టినా, సమప్రియ, యోగితా హరిణి ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రూ.15వేలు నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలియజేశారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: గడప గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారుల అభివృద్ధి, మురుగునీరు పారుదల, విద్యుత్ దీపాలు వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయా సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారుల అభివృద్ధి అంశంపై కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయాలు సేకరించారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు.....

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితులు, ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమాన్ని విడవకుండా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజల సంతృప్తికర స్థాయి పెరిగిందని పేర్కొన్నారు. కుటుంబాల ఉన్నతికి తోడ్పాటునందించేలా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రతిపక్షాలు మాత్రం ప్రభుత్వంపై బురదచిమ్మటమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలంతా బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిపక్ష నేతలకు సరైన గుణపాఠం చెప్పాలని పార్థసారథి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా, ఎంపీటీసీ ఉప్పలూరు శాంతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, దుర్గగుడిబోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, సొసైటీ చైర్మన్ వీరంకి నరేష్,సర్పంచ్‌లు సిహెచ్ ఆదర్శకుమార్, చిప్పల రామదాసు, ఎంపీటీసీలు బండి శ్రీనివాసరావు, ఒడుగు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దండాబత్తిన సుబ్బారావు, మట్టా నాగరాజు, లంక వెంకయ్య, ఉప్పలూరి సునీల్, కలపాల వజ్రాలు, జె.శేషయ్య, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఈఓ సువర్ణలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన ఉండాలి

డీఎస్పీ జయసూర్య



కానూరులో వాక్‌దాన్ ప్రారంభిస్తున్న డీఎస్పీ జయసూర్య

పెనమలూరు: ప్రతి ఒక్కరికీ గుండె జబ్బులపై అవగాహన ఉండాలని గన్నవరం సర్కిల్ డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పోరంకి క్యాపిటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వాక్‌దాన్ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ జయసూర్య జెండా ఊపి వాక్‌దాన్ ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయాలని సూచించారు. 40 సంవత్సరాలు దాటిన వారు క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ఎవ్వరూ నిర్లక్ష్యం చూపరాదన్నారు. క్యాపిటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మన్నే హరీష్ మాట్లాడుతూ అక్టోబర్ నెలలో గుండె పరీక్షలు కేవలం రూ.999తో తమ ఆస్పత్రిలో చేయించుకోవచ్చన్నారు. మిగతా వైద్య పరీక్షలకు కూడా 30 శాతం రాయితీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ వీఎస్ఆర్ భూపాల్, 250 మంది వాక్‌దాన్‌లో పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె జబ్బులు నివారణ



కానూరులో గుండె వైద్య శిబిరం ప్రారంభించిన విద్యార్థులు

పెనమలూరు: వ్యాయామంతో గుండె జబ్బులు నివారించవచ్చని ఆయూష్ ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక రక్తపోటు, షుగర్, కొవ్వు నియంత్రణ, క్రమబద్ధమైన ఆహారం, వ్యాయామంతో గుండె జబ్బులు రాకుండా నివారించవచ్చని చెప్పారు. 40 సంవత్సరాలు దాటిన వారు క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాని సూచించారు. ఈ సందర్భంగా గుండె పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో టీడీపీ ఓవరాక్షన్

- సభ్యుల తీరుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ఆగ్రహం
- దొంగని దొంగ అనక ఏమంటారు అంటూ మండిపాటు



బైఠాయించిన టీడీపీ కౌన్సిలర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

ఉయ్యూరు: టీడీపీ సభ్యులు అనవసర రాద్ధాంతానికి దిగారు. కౌన్సిల్ విలువైన సమయాన్ని వృథా చేస్తూ చంద్రబాబు అరెస్టుపై నిరసనకు దిగారు. టీడీపీ సభ్యులు బైఠాయింపుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల నడుమ మాటల యుద్ధం జరగటంతో కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా మారటంతో ప్రజాంశాలకు సంబంధించిన అజెండా అంశాలను ఆమోదించి చైర్మన్ వల్లభనేని నాని కౌన్సిల్‌ను ముగించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే టీడీపీకి చెందిన నలుగురు కౌన్సిల్ సభ్యులు చంద్రబాబు అరెస్టుపై కౌన్సిల్‌లో బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, కౌన్సిలర్లు కూరాడ వెంకటలక్ష్మి, ఎండి బేగ్ తదితరులు జోక్యం చేసుకున్నారు. టీడీపీ కౌన్సిలర్ల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌కు సంబంధం లేని అంశంపై సమావేశంలో ఆందోళన చేయటం మంచి పద్ధతి కాదని, చేయాలనుకుంటే బయటకు వెళ్లి నిరసన తెలుపుకోవచ్చని చెప్పటంతో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. దొంగని దొంగే అంటారని కౌన్సిలర్ బేగ్ స్పష్టం చేశారు. అధికార పక్షసభ్యులు అందరూ టీడీపీ సభ్యుల వ్యవహారశైలి, చంద్రబాబు స్కిల్ కుంభకోణంపై ధ్వజమెత్తారు. సమావేశం వాడీవేడీగా మారటంతో చైర్మన్ వల్లభనేని నాని, కౌన్సిల్ అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నట్లు సభ్యులు అంగీకారంతో ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. కేసు నమోదు

కంకిపాడు: బాలికపై లైంగిక దాడి ఘటనపై కంకిపాడు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు... మండలంలోని గొడవర్రు గ్రామానికి చెందిన మైనరు బాలిక ఈనెల 22న అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు కుంపటి చందు, అతని స్నేహితుడు అభినవ్ సంజయ్ ఆటోలో వెళ్తుండగా తనను తన ఇంటి వద్ద దింపమని అడిగింది. ఆటోలో బాలికను ఇంటి వద్ద దింపకుండా నేరుగా రొయ్యూరు గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ వైన్‌షాప్ వద్ద మద్యం తీసుకుని చందు, అభినవ్ సంజయ్ తాగారు. అభినవ్ కొంత దూరం వెళ్లాక చందు లైంగిక దాడి చేశాడని కుమార్తె చెప్పినట్లు ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.